మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 29-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 92 Issue: 92

29 సెప్టెంబర్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:03 తిథి తదియ సా. 5:08 వరకు తరువాత చవితి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం అశ్విని ఉ. 9:02 వరకు తరువాత భరణి యోగం హర్షణ తె. 3:15o వరకు కరణం వనిజ ఉ. 6:14 వరకు విష్టి సా. 5:08 వరకు వర్జ్యం తె. 5:15 నుండి ఉ. 6:46 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:20 వరకు రా. 10:53 నుండి రా. 11:42 వరకు రాహుకాలం మ. 3:04 నుండి సా. 4:34 వరకు యమగండం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు గుళికకాలం మ. 12:06 నుండి మ. 1:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు తె. 3:05 నుండి తె. 4:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:30 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## గడ్డిమందు.. పారాక్వాట్ డైక్లోరైడ్‌పై నిషేధం



పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: ఈ నిర్ణయంతో పారాక్వాట్‌ను నియంత్రించిన సుమారు 70 దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయింది. ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్, 1968 నిబంధనల ప్రకారం, నిపుణుల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీల సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించిన తరువాయి 2 వ పేజీలో...

## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ

### గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ తరువాయి 2 వ పేజీలో...




## 92 లక్షల మంది సర్ నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. 92,88,180 నోటీసులు జనరేట్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. 87,85,739 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 58,97,432 ఓటర్ల హియరింగ్ పూర్తయిందని.. 45,54,236 ఓటర్లను తుది జాబితాకు అర్హులుగా నిర్ధరించినట్లు వివరించారు.

## సినిమాకు ముందు 22 నిమిషాల యాడ్స్..

### థియేటర్‌కు రూ.75,000 జరిమానా



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): సినిమా ప్రదర్శనకు ముందు సుదీర్ఘంగా వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించి, ప్రేక్షకులకు అసౌకర్యం కలిగించిన హైదరాబాద్‌లోని పీవీఆర్ థియేటర్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. బాధితుడికి చెల్లించాల్సిన పరిహారంతో పాటు జరిమానా రూపంలో మొత్తం రూ. 75, 000 చెల్లించాలని ఆదేశిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఒక ప్రేక్షకుడు చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 2025 జూన్‌లో ఒక వ్యక్తి తన స్నేహితుడితో కలిసి 'కుబేర' సినిమాను తరువాయి 2 వ పేజీలో...

# శివా.. రామా..!

### శివుడు దక్షిణాది దేవుడట.. శ్రీరాముడు ఉత్తరాది దేవుడట

### 'ప్రతిదిన్' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

శివుడు, రాముడు కూడా రాజకీయాల్లో చేరిపోయారు. ఎంతలా అంటే.. శివుడు లేనోళ్ల దేవుడు అని, రాముడు ఉన్నోళ్ల దేవుడు అని వ్యాఖ్యానించేంతగా. సోమవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో అస్సాం దినపత్రిక ప్రతిదిన్ పత్రిక నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. స్వాతంత్రోద్యమ సమయంలో ఏకపక్షంగా భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించే ప్రయత్నాన్ని అడ్డుకొనేందుకు లాలా లజపతి రాయ్ సైమన్ గోబ్యాక్ ఉద్యమాన్ని నిర్మించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు.



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏకపక్షంగా సైమన్ కమిషన్ తరహాలో ఎన్నికల సంఘం నిర్మాణాన్ని మార్చి సొంత అవసరాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ 'బ్రిటిష్ జనతా పార్టీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగ సభలో సుదీర్ఘంగా చర్చించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారని, ఆ తర్వాత జరిగిన అన్ని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లలో ప్రతీ పౌరుడికి ఓటుహక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేశారని, మొదటిసారి ఓట్లను తొలగించడానికి దీన్ని దుర్మార్గంగా వాడుతున్నారని మండిపడ్డారు.దేశంలో జనాభా పెరుగుతుంటే ఓట్లు మాత్రం ఎందుకు తగ్గుతున్నాయని రేవంత్ ప్రశ్నించారు. మోదీ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి కోట్ల కొద్దీ ఓట్లను తొలగిస్తున్నారని మండిపడ్డారు. 2014లో మోదీ ప్రధాని అయినప్పుడు దేశంలో 81 కోట్ల ఓట్లు ఉండగా 2019 నాటికి 91 కోట్లకు, 2024 నాటికి 97 కోట్లకు చేరాయన్నారు. తాజాగా ఏకంగా 13 కోట్ల ఓట్లు తొలగించారని తరువాయి 2 వ పేజీలో...



## ఉత్తరాదిన గజగజ.. దక్షిణాదిన భగభగ

సాధారణంగా అక్టోబర్ తర్వాత ప్రారంభమయ్యే చలి, ఈసారి సెప్టెంబర్‌లోనే ఉత్తర భారతాన్ని పలకరించింది. ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పడిపోవడంతో శీతాకాలం ముందే వచ్చేసిందా? అనే చర్చ మొదలైంది. భారీ వర్షాలు, చల్లని గాలుల కారణంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నిన్న ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు)/ న్యూఢిల్లీ: ఇది 2001 తర్వాత సెప్టెంబర్ నెలలో నమోదైన రెండో అత్యల్ప ఉష్ణోగ్రత కావడం గమనార్హం. సాధారణం కంటే ఇది సుమారు మూడు డిగ్రీలు తక్కువ. నగరంలోని రిడ్జ్ ప్రాంతంలో ఏకంగా 16.8 డిగ్రీలకు పడిపోయి చలి తీవ్రతను పెంచింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలే కాకుండా గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా -2 వ పేజీలో...

## టీజీపీఎస్సీ ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల




హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,268 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,390 |

## విశ్వవాణి



అతిగా ఆలోచించడం సాధారణంగా సమస్యలను పదేపదే తలచుకోవడం, ప్రతికూల పరిణామాలను ఊహించుకోవడంతో కూడిన మానసిక ప్రక్రియ. దీనిని 'రూమినేషన్'గా పేర్కొంటారు. ఇది ఒత్తిడి, ఆందోళన, నిరాశకు దారితీసే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ఆలోచనలకు సరైన దిశనిస్తే ఇదే అలవాటు సృజనాత్మకత, ప్రణాళిక, సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. సమస్యలను కొత్త కోణంలో చూడటం, ఆలోచనలను రాసుకోవడం, విశ్లేషణ తర్వాత ఆచరణలోకి వెళ్లడం వంటి పద్ధతులు ప్రతికూల ఆలోచనల చక్రాన్ని తగ్గించగలవు. మెదడులో అంతర్గత ఆలోచనలకు సంబంధించిన 'డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్' కీలక పాత్ర పోషిస్తుంది. దానికి సరైన దిశనిస్తే పదేపదే అదే విషయాన్ని ఆలోచించే బదులు లోతైన విశ్లేషణ, సృజనాత్మక ఆలోచనకు దోహదపడుతుంది. అంటే అతిగా ఆలోచించడం పూర్తిగా లోపం కాదని, దాన్ని క్రమబద్ధీకరించగలిగితే మానసిక వనరుగా ఉపయోగించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.




## రాశి ఫలాలు

29.9.2026

**మేషం:** వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు వింటారు. రాజకీయ వర్గాల వారి నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం:** స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి. వ్యాపార ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

**మిధునం:** దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు పెరుగుతాయి. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆస్తి వ్యవహారంలో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

**కర్కాటకం:** భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి. అధికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు సానుకూలమవుతాయి.

**సింహం:** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఇతరులపై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

**కన్య:** చిన్ననాటి విషయాలు గుర్తుకువస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

**తుల:** ఆధ్యాత్మక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ విభేదాలు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. శ్రమతో కానీ కొన్ని పనులు పూర్తి కావు.

**వృశ్చికం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. దాయాదులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

**ధనస్సు:** చిన్ననాటి మిత్రుల కలయిక సంతోషాన్నిస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత మెరుగ్గా ఉంటాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**మకరం:** ముఖ్యమైన పనులు మందగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

**కుంభం:** ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఇంటా బయట కొందరు మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

**మీనం:** ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు అధికమవుతాయి.

# సెమీకండక్టర్.. మేడిన్ ఇండియా

## సెమికాన్ 1.0తో దేశంలో పెరిగిన తయారీ సామర్థ్యాలు.. గ్లోబల్ చిప్ హబ్‌గా ఎదిగే లక్ష్యంతో రెండో దశ

## రూ.1,27,500 కోట్లతో 'సెమికాన్ 2.0'కు కేంద్రం శ్రీకారం.. దిగుమతుల భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రపంచ సాంకేతిక పటంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టే దిశగా సెమీకండక్టర్ రంగానికి కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మద్దతు అందిస్తోంది. డిజైన్, తయారీ, ప్యాకేజింగ్, మెటీరియల్స్ విభాగాల్లో స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా భారీ కేటాయింపులతో అడుగులు ముందుకు వేస్తోంది. గ్లోబల్ సెమీకండక్టర్ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుంది.



### రూ.1.27 లక్షల కోట్లతో సెమికాన్ 2.0

తొలి దశ సెమికాన్ 1.0 విజయవంతం కావడంతో, దానికి కొనసాగింపుగా సెమికాన్ 2.0ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నూతన పథకానికి రూ. 1,27,500 కోట్ల నిధులను కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా కేవలం చిప్ తయారీకే పరిమితం కాకుండా ఆర్‌అండ్‌డీ, యంత్రాలు, ముడి పదార్థాల లభ్యత, అధునాతన ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి ఆరు వ్యూహాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

### దిగుమతుల భారం తగ్గేలా వ్యూహం

ప్రస్తుతం మన దేశ ఎలక్ట్రానిక్ రంగానికి అవసరమైన సెమీకండక్టర్ల కోసం ఇతర దేశాలపై తీవ్రంగా ఆధారపడాల్సి వస్తోంది. రాబోయే 2030 నాటికి దేశీయంగా చిప్‌ల డిమాండ్ 110 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 200 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. స్వదేశీ తయారీని పుంజుకునేలా చేయడం ద్వారా వేల కోట్ల రూపాయల దిగుమతి భారాన్ని తగ్గించి, సాంకేతిక భద్రత సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు.

### అత్యంత వేగంగా విస్తరిస్తున్న పరిశ్రమ

గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థల్లో వచ్చిన అంతరాయాలు సెమీకండక్టర్ల ప్రాధాన్యాన్ని స్పష్టం చేశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 5జీ/6జీ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ ఉత్పత్తులలో చిప్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం స్వయం సమృద్ధి సాధించడం దేశానికి అత్యంత ప్రాధాన్య అంశంగా మారింది.

### విజయవంతంగా సాగుతున్న తొలిదశ



### ఫలితాలు

గతంలో ప్రారంభించిన సెమికాన్ 1.0 ద్వారా రూ. 1.64 లక్షల కోట్ల పెట్టుబడులతో 12 తయారీ యూనిట్లకు అనుమతులు లభించాయి. అందులో ఐదు యూనిట్లు ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, అంతరిక్ష ప్రయోగ వాహనాల్లో స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన చిప్‌లను విజయవంతంగా ఉపయోగించారు. జర్మనీ, అమెరికా, జపాన్ వంటి అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి దేశీయంగా ప బలమైన వ్యవస్థను నిర్మిస్తున్నారు.

### యువతకు భారీగా ఉద్యోగావకాశాలు

వివిధ సంస్కరణలు, స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ అండ్ సెమీకండక్టర్స్ (స్పెచ్‌స్), పీఎల్ఐ పథకాల ద్వారా ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ చర్యల వల్ల దేశీయంగా సాంకేతిక నైపుణ్యాలు పెరగడమే కాకుండా, ఇంజనీరింగ్ విద్యార్థులకు, యువ పరిశోధకులకు స్వదేశంలోనే అధిక వేతనాలతో కూడిన నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయి.

# శివా.. రామా..!




**మొదటి పేజీ తరువాయి**

చెప్పారు. వీటితో పాటు కొర్రీల ద్వారా మొత్తం 30 కోట్ల ఓట్లు తొలగించడం లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వారిని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని లక్ష్యంగా చేసుకొని ఓట్లు తొలగిస్తున్నారని చెప్పారు. మోదీజీకి అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే ఓటు హక్కు ఉండేలా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బూత్ స్థాయి అధికారికి, కలెక్టర్‌కు ఉండే అధికారాలను సైతం ఢిల్లీలో కూర్చున్న ఎన్నికల సంఘం తన గుప్పిట్లోకి తీసుకుందని, ఏఐ టెక్నాలజీని వాడి ఓట్లను తొలగిస్తోందని అన్నారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దర్ని పక్కన బెట్టి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాతలు దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని ప్లాన్ చేస్తే మోదీ ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని మొత్తం ప్రజాస్వామ్యానికే ఎసరు పెడుతున్నారని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను పది రోజులు ఉత్తర కొరియాకు పంపించాలని, ఆయన కిమ్ దగ్గర శిక్షణ తీసుకొచ్చి, ప్రధాని మోదీకి దేశంలో వందకు వంద శాతం ఓట్లు వేయిస్తారని రేవంత్ ఎద్దేవా చేశారు.

శివుడు పేదల దేవుడు..

దక్షిణాది వాళ్లు ద్రావిడులని, ఉత్తరాది వారు ఆర్యులని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము శివ భక్తులమని, వారు రామ భక్తులని చెప్పారు. ప్రధాని మోదీ ఎప్పుడైనా హరహర మహాదేవ్ అంటారా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు వేదికలపై కేవలం జై శ్రీరామ్ మాత్రమే అంటారని ప్రస్తావించారు. శివుడు పేదల దేవుడని, శ్రీరాముడు సంపన్నుల దేవుడని, బీజేపీ సంపన్నుల పార్టీయేనని వ్యాఖ్యానించారు. అవకాశం వస్తే మోదీని నిలదీస్తా ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ప్రతిపక్ష పాలనలో ఉన్న గుజరాత్‌కు ఇచ్చిన మద్దతులో పదో వంతు కూడా మోదీ తెలంగాణకు ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. రీజినల్ రింగు రోడ్డు, మెట్రో రైలు, జాతీయ రహదారుల విస్తరణ ఫైళ్లు రెండేళ్లుగా పీఎంఓలోనే ఆగిపోయాయని తెలిపారు. నితిన్ గడ్కరీని అడిగినా ఫైల్ మోదీ వద్దే ఉందని చెబుతున్నారని వెల్లడించారు. తెలంగాణకు అన్ని హంగులు ఉన్నప్పటికీ చివరి నిమిషంలో సెమీకండక్టర్ ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆరోపించారు. మోదీ సంస్థలను బెదిరించి మరీ ప్రాజెక్టులను అక్కడికి తరలిస్తున్నారని మండిపడ్డారు. అవకాశం వస్తే మోదీని ఎదురుగా కూర్చోబెట్టి ఈ విషయాలపై నిలదీస్తానని చెప్పారు.

# థియేటర్‌కు రూ.75,000 జరిమానా

**మొదటి పేజీ తరువాయి**

వీక్షించేందుకు సదరు థియేటర్‌కు వెళ్లారు. రాత్రి 10:35 గంటలకు సినిమా ప్రారంభం కావాల్సి ఉండగా, వారు 10:30 గంటలకే తమ సీట్లలో కూర్చున్నారు. అయితే, థియేటర్ యాజమాన్యం రాత్రి 10:52 గంటల వరకు, అంటే సుమారు 22 నిమిషాల పాటు వాణిజ్య ప్రకటనలు, ఇతర సినిమాల ట్రైలర్లను ప్రదర్శించింది. అనంతరం పబ్లిక్ సర్వీస్ ప్రకటనలు వేసి అసలు సినిమాను ఆలస్యంగా ప్రారంభించింది. సినిమా ప్రారంభంలో జరిగిన ఈ జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సదరు ప్రేక్షకుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన కమిషన్, ఫిర్యాదుదారుడికి కలిగిన మానసిక ఆవేదనకు, అసౌకర్యానికి నష్టపరిహారంగా రూ. 25,000 చెల్లించాలని థియేటర్ యాజమాన్యాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, ఇటువంటి అనుచిత వ్యాపార ధోరణులు పునరావృతం కాకుండా ఉండేందుకు జిల్లా వినియోగదారుల సంక్షేమ నిధికి మరో రూ. 50,000 జమ చేయాలని స్పష్టం చేసింది. వాణిజ్య ప్రకటనల ద్వారా అదనపు ఆదాయం పొందేందుకే థియేటర్ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా సినిమాను ఆలస్యం చేసిందని కమిషన్ అభిప్రాయపడింది. ఈ జాప్యం కారణంగా ఫిర్యాదుదారుడు తన ఇంటికి నిర్దేశిత సమయం కంటే గంట ఆలస్యంగా, అంటే వేకువజామున 3 గంటలకు చేరుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రకటనలు ప్రదర్శించడం తమ వ్యాపార హక్కు అని థియేటర్ తరఫున చేసిన వాదనను కమిషన్ ఈ సందర్భంగా తోసిపుచ్చింది.

# గడ్డిమందు.. పారాక్వాట్ డైక్లోరైడ్‌పై నిషేధం

**మొదటి పేజీ తరువాయి**

కొత్త రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సదరు సర్టిఫికెట్లను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసింది.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ

**మొదటి పేజీ తరువాయి**

విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఉత్తరాదిన గజగజ.. దక్షిణాదిన భగభగ

**మొదటి పేజీ తరువాయి**

ఉత్తర భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు, దట్టమైన మేఘాలు, ఈశాన్య దిశ నుంచి వీస్తున్న చల్లని గాలుల కలయికతో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయని వాతావరణ శాఖ అధికారులు వివరించారు.

### తెలంగాణలో భగభగలు

తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# టీజీపీఎస్సీ ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

**మొదటి పేజీ తరువాయి**

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# భారత్‌లో 110 కోట్ల బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు

న్యూఢిల్లీ: భారతదేశ టెలికం రంగం మరోసారి వృద్ధి పథంలో దూసుకెళ్లింది. ఆగస్టు నెలలో బ్రాడ్‌బ్యాండ్, వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ సేవలు విస్తరిస్తున్నాయనడానికి ఈ సంఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం, ఆగస్టు 2026 చివరి నాటికి దేశంలో బ్రాడ్ బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,101.21 మిలియన్లకు (సుమారు 110.12 కోట్లు) చేరింది. జులై నెలలో ఈ సంఖ్య 1,094.48 మిలియన్లుగా ఉండగా, కేవలం ఒక్క నెలలోనే 0.61 శాతం వృద్ధి నమోదైంది. ఇదే సమ యంలో, యాక్టివ్ వైర్‌లెస్ (మొబైల్) సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,207.59 మిలియన్లుగా (120.75 కోట్లు) ఉన్నట్లు తేలింది. కాగా, ఆగస్టు నెలలో ఏకంగా 15.83 మిలియన్ల (1.58 కోట్లు) మంది తమ మొబైల్ నెట్‌వర్క్‌ను మార్చుకునేందుకు మొబైల్ నంబర్ పోర్టబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. మరోవైపు, వైర్‌లైన్ (ల్యాండ్‌లైన్) కనెక్షన్ల సంఖ్య కూడా పెరిగింది. జులై చివరికి 48.01 మిలియన్లుగా ఉన్న ఈ సంఖ్య, ఆగస్టు చివరి నాటికి 48.45 మిలియన్లకు చేరింది. నెలవారీగా 0.93 శాతం పెరుగుదల కనిపించింది. వైర్‌లైన్ కనెక్షన్లలో పట్టణ ప్రాంతాల వాటా 89.08 శాతంగా ఉండగా, గ్రామీ ణ ప్రాంతాల వాటా 10.92 శాతంగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఏపీఎస్ ఎఫ్ఎల్ కలిసి వైర్‌లైన్ మార్కెట్‌లో 16.05 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇదిలా ఉండగా, వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ట్రాయ్ ఇటీవల ఒక కీలక ముందడుగు వేసింది. ఇళ్లు, కార్యాల యాలు వంటి భవనాల్లో డిజిటల్ కనెక్టివిటీ నాణ్యతను తెలుసుకునేందుకు 'డిజిటల్ కనెక్టివిటీ రేటింగ్' పేరుతో ఒక కొత్త ప్లాట్‌ఫామ్‌ను, మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియో గదారులు తాము కొను గోలు చేయాలనుకు ంటున్న లేదా అద్దెకు తీసుకోవా లనుకుంటున్న భవనాల్లో ఇంట ర్నెట్, మొబైల్ సిగ్నల్ నాణ్యత ఎలా ఉందో ముందుగానే తనిఖీ చేయ వచ్చు. "ఈ రేటింగ్స్ వల్ల వినియోగదారులు సమాచా రంతో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కలుగు తుంది. నాణ్యమైన కనెక్టివిటీ ఉన్న ఇళ్లు, ఆఫీసులను ఎంచుకోవ డానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది" అని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటీ వివరించారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఎఫుడ్ లేబుల్స్‌లో జాప్యం ఎందుకు?

## ఎఫ్ఎస్ఎస్ఏఐపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై 'ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ లేబులింగ్' విధానం అమలులో జరుగుతున్న జాప్యంపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇది ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అత్యంత కీలకమైన అంశమని, దీని అమలులో ఇంత జాప్యం తగదని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, తన తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. విచారణ సందర్భంగా జస్టిస్‌లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వైఖరిని ప్రశ్నించారు. "ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సున్నితమైన అంశం. దీన్ని అమలు చేయడానికి మీకెందుకు ఇంత సమయం పడుతోంది? సమయాన్ని ఎందుకు వృథా చేయాలనుకుంటున్నారు? దీనిపై మాకు ఆందోళనగా ఉంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, "అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్"కు స్పష్టమైన, కచ్చితమైన నిర్వచనం ఉండాలని ఆదేశించింది. ఈ కేసులో సంబంధిత పక్షాలన్నీ మూడు రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.డవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది. సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం

**అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## టాటా సన్స్‌ను లిస్టింగ్ నుంచి తప్పిస్తారా!

ముంబై: టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌ను స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేయకుండా నివారించేందుకు, అందులో 66 శాతం మెజారిటీ వాటా కలిగి ఉన్న టాటా ట్రస్ట్స్ ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేసింది. టాటా సన్స్ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించడం ద్వారా, లిస్టింగ్ తప్పనిసరి చేసే నిబంధనల నుంచి మినహాయింపు పొందాలని టాటా ట్రస్ట్స్ భావిస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, టాటా గ్రూప్‌కు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఈఎస్ఎస్), టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ (టీసీఈ) అనే రెండు ఆపరేటింగ్ కంపెనీలను టాటా సన్స్‌లో విలీనం చేయనున్నారు. ఈ విలీనం పూర్తయితే టాటా సన్స్ కేవలం పెట్టుబడుల సంస్థగా మాత్రమే కాకుండా, ప్రత్యక్షంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే 'ఆపరేటింగ్ కంపెనీ'గా రూపాంతరం చెందుతుంది.

# ఏఐ దూకుడుకు ఎన్విడియా కళ్లెం




న్యూయార్క్: టెక్నాలజీ దిగ్గజం, చిప్‌మేకర్ ఎన్విడియా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భద్రత విషయంలో కీలక ముందడుగు వేసింది. ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించకుండా నిరోధించేందుకు ఒక కొత్త సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌ను ఆవిష్కరించింది. 'ఎన్విడియా ఓపెన్ ఏజెంట్ సేఫ్టీ ప్లాట్‌ఫామ్' పేరుతో తీసుకొచ్చిన ఈ టూల్‌ను 100కు పైగా పరిశ్రమ భాగస్వాములతో కలిసి అభివృద్ధి చేసినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్లాట్‌ఫామ్ ఏఐ ఏజెంట్లు చేసే ప్రతి పనిని పర్యవేక్షిస్తుంది. కంపెనీ నిబంధనలను అతిక్రమించకుండా చూస్తుంది. ఈ సందర్భంగా ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ మాట్లాడుతూ, "ఏఐ భద్రత సమస్యను పరిష్కరించినప్పుడే సమాజానికి దాని అసాధారణ సామర్థ్యం పూర్తిగా అందుబాటులోకి వస్తుంది. ఏఐ సామర్థ్యాల సరిహద్దులను మనం కనుగొంటున్న కొద్దీ, ఏఐ భద్రత విషయంలోనూ ఆవిష్కరణలను వేగవంతం చేయాలి" అని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ఏఐ వ్యవస్థలు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు లేకుండానే కార్పొరేట్, ప్రభుత్వ వ్యవస్థల్లోకి చొరబడినట్లు వార్తలు వచ్చాయి. ఓపెన్‌ఏఐ ఏజెంట్లు అమెరికా ప్రభుత్వ సైట్లను లక్ష్యంగా చేసుకున్నాయనే నివేదికలు ఆందోళన రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ వంటి వారు ఏఐపై కఠినమైన నియంత్రణలు ఉ ండాలని పిలుపునిచ్చారు. అయితే, జెన్సన్ హువాంగ్ మాత్రం ఈ వాదనతో విభేదిస్తున్నారు. ఏఐ వల్ల మానవాళికి పెను ముప్పు ఉ ందన్న వాదనలను ఆయన కొట్టిపారేశారు. నిబంధనలు పరిశ్రమ వృద్ధికి ఆటంకం కలిగించకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. "తమ కంపెనీ అదుపు తప్పుతోందని వారు భావిస్తే, ముందు ఆ కంపెనీని అదుపులోకి తెచ్చుకోవాలి" అంటూ సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ఫస్‌బుక్‌లో పరిచయం.. 14.61 కోట్లు

# పోగొట్టుకున్న హైదరాబాద్ డాక్టర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెట్టిన ఓ దంత వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లు పోగొట్టుకున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని జరిగిన అతిపెద్ద సైబర్ మోసాల్లో ఒకటిగా ఈ ఘటన నిలిచింది. బాధితుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)ని ఆశ్రయించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన 44 ఏళ్ల దంత వైద్యుడికి ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్‌లో 'మోనికా మాధవ్' అనే పేరుతో ఒక మహిళ పరిచయమైంది. తాను చెన్నైకి చెందిన దానినని, విడాకుల ప్రక్రియలో ఉన్నానంటూ సానుభూతి పొందింది. ఆ తర్వాత తనను టెలిగ్రామ్‌లో సంప్రదించాలని కోరి, తాను ట్రేడింగ్ ద్వారా రోజూ రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నట్లు నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వైద్యుడితో ఎఎఎఖితీనెవ్ం‌శ్రీ.ఎ.ఏశీఎ అనే నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లో ఖాతా తెరిపించి, ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేయించింది. నమ్మకం కుదిర్చేందుకు, సెప్టెంబర్ 3న వైద్యుడు పెట్టిన రూ.30 లక్షల పెట్టుబడికి రూ.8.6 లక్షలు లాభం వచ్చినట్లు సైట్‌లో చూపించారు. అందులో నుంచి రూ.85,000 విత్‌డ్రా చేసుకునేందుకు కూడా అనుమతించడంతో అతనికి అనుమానం రాలేదు. ఇదే అదనుగా, ఇద్దరం కలిసి రూ.10 కోట్లు పెట్టుబడి పెడదామని ఆమె ప్రతిపాదించింది. దీంతో వైద్యుడు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు, అప్పులు చేసి విడతల వారీగా మొత్తం రూ.14.51 కోట్లు డిపాజిట్ చేశాడు. ఆయన ఖాతాలో మొత్తం లాభం రూ.34 కోట్లు ఉన్నట్లు సైట్‌లో కనిపించింది. ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, ఆప్షన్ పనిచేయలేదు. డబ్బు రావాలంటే పన్నుల కింద రూ.7.5 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు డిమాండ్ చేశారు. అదే సమయంలో మోనికా తన కాంటాక్ట్‌లను బ్లాక్ చేసి అదృశ్యమవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై ఐటీ చట్టంలోని సెక్షన్ 66-డీతో పాటు భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితుడు 91 సార్లు డబ్బు బదిలీ చేసినట్లు, ఆ మొత్తం 10 రాష్ట్రాల్లోని 40 బ్యాంకు ఖాతాలకు మళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. టీజీసీఎస్‌బీ అధికారులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నిక మాములుగా ఉండదు: దానం



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలో వచ్చే తీర్పు నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దానం నాగేందర్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ 'ఓట్ల దొంగతనం' చేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఖైరతాబాద్ సీటు ఫలితాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దానం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉ పఎన్నికలో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

## నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి

**తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత**

న్యూఢిల్లీ: తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది.

## 41 కొత్త బార్లకు గ్రీన్ సిగ్నల్

**దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలో కొత్తగా 41 బార్ అండ్ రెస్టారెంట్ల (2బీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరితో కూడిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలో 14, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27 బార్లకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల నాన్-రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 12 వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విజేతలను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు లైసెన్స్ తీసుకోకపోతే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు ఊరట



న్యూఢిల్లీ: 2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. 2015లో రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఈ కేసు నమోదైంది. నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ. 5 కోట్ల ఒప్పందంలో భాగంగా రూ. 50 లక్షల అడ్వాన్స్ ఇవ్వజూపారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఆ రూ.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. ఈ ఏసీబీ కేసును ఆధారంగా చేసుకునే ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ఆస్తులను అటాచ్ చేసింది. ఈడీ అటాచ్‌మెంట్‌ను ఖరారు చేస్తూ 2022లో వెలువడిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్, ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

## విశాఖలో హైదరాబాదీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య

వైజాగ్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ఏపీలోని విశాఖపట్నం నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చిన ఓ వైద్య విద్యార్థిని తన జీవితాన్ని అర్థాం తరంగా ముగించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి (22) అనే యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే, హైదరా బాద్‌కు చెందిన శ్రావణి విశాఖ ఏఎంసీలో పీజీలో చేరింది. నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చినవాల్తేరులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. సోమవారం ఉదయం ఆమె తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందు కున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ శకుంతల ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేశారు. శ్రావణి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కింగ్ జార్జ్ ఆసు పత్రి (కేజీహెచ్) మార్చురీకి తరలించారు. ఉన్నత భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ఇలా ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది.

# కరీంనగర్‌లో ఘనంగా శాతవాహన గ్రామీణ సంత ప్రారంభం

కరీంనగర్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య రక్షణే ధ్యేయంగా కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో సోమవారం శాతవాహన గ్రామీణ సంత ఘనంగా ప్రారంభమైంది. గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంత నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. ఇందులో వివిధ గ్రామీణ ఉత్పత్తులతో కూడిన 40 స్టాళ్లను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, సేంద్రియ ఆహార పదార్థాలు, మట్టి పాత్రలు, హస్తకళలు, మూలికా ఆరోగ్య ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. దేశీయ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో రసాయనాలకు దూరంగా ఉంటూ ప్రకృతి సిద్ధమైన స్వదేశీ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణహిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్ సంయోజక్ జిన్నా సత్యనారాయణరెడ్డి, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శంకరయ్య, గ్రామ భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గాలి పెల్లి నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి కూర్మాచలం మునిందర్, ఉపాధ్యక్షుడు క్యాస మధు, కార్యదర్శి గొల్లె తిరుపతి, శివనాథుల




స్వప్న, గ్రామ వికాస్ జిల్లా సంయోజక్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ ఉద్యోగం పేరుతో రూ.50 వేల మోసం

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద నుంచి రూ.50 వేలు తీసుకుని మోసం చేశాడంటూ గొల్లపల్లి మండలం చిల్వాకోడూరుకు చెందిన ఆలియా ఫాతిమా జగిత్యాల జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం తాను పీజీ, బీఈడీ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో తన భర్త స్నేహితుడి ద్వారా సంబంధిత వ్యక్తిని సంప్రదించినట్లు తెలిపారు. తన విద్యార్హతలు పరిశీలించిన అనంతరం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్లో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందుకు రూ.లక్ష ఖర్చవుతుందని చెప్పాడని, ముందుగా రూ.50 వేలు తీసుకున్నాడని ఫాతిమా తెలిపారు. అయితే నాలుగేళ్లు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదని వాపోయారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే స్పందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఫిర్యాదు చేస్తే డబ్బులు ఇవ్వనని, ఈ విషయం ఎక్కడైనా చెబితే ఒక్క రూపాయి కూడా ఇవ్వనని బెదిరిస్తున్నాడని ఆమె ఆరోపించారు. తాను డబ్బులు చెల్లించిన విషయానికి సంబంధించిన ఫోన్ సంభాషణ రికార్డు కూడా తన వద్ద ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని, తన డబ్బులు తిరిగి ఇప్పించాలని ఆమె ఎస్పీని కోరారు.



## హిందీ టీచర్ లేక విద్యార్థినుల ఇక్కట్లు

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): జగిత్యాల పాత బస్టాండ్‌లోని బాలికల హైస్కూల్ (ఇంగ్లీష్ మీడియం)లో హిందీ ఉపాధ్యాయుడు రాజేష్ గత మూడు నెలలుగా విధులకు హాజరు కావడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 260 మంది విద్యార్థినులు చదువుతుండగా, హిందీ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్టోబర్ 1 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థినుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఈ సమస్యపై కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, విచారణకు ఆదేశించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యార్థినుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లో ప్రోటోకాల్ వివాదం

కోరుట్ల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. నిరసన కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ పార్టీలో ప్రోటోకాల్ అంశంపై వివాదం చోటుచేసుకుంది. కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్యను నిలదీశారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో కోరుట్లలో జువ్వాడి వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యకర్తలు ఆరోపించారు. కల్వకుంట్ల సుజిత్‌రావు వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ పదవుల కేటాయింపులో తమ వర్గానికి అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై డీసీసీ అధ్యక్షుడు నందయ్యను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నించారు.ద

## ప్రీ-ప్రైమరీ టీచర్ శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): మహిళలకు స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు, నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, విద్యార్థినులు ఈ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రీ-ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, మాంటెస్సోరి టీచర్ ట్రైనింగ్, నర్సరీ టీచర్ ట్రైనింగ్, కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన మహిళలు, విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులను ఆన్‌లైన్ బోధన ద్వారా ఇంటి నుంచే పూర్తిచేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తామని, ఉత్తీర్ణులైన వారికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందిన సంస్థల నుంచి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని చెప్పారు.




## పొలాసలో స్థల వివాదం.. కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో తమ ఇంటి ముందున్న స్థలానికి సంబంధించి వివాదాస్పద పరిస్థితులు నెలకొన్నాయని ఎం.డి. మోకార్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సుమారు 75 ఏళ్లుగా తమ కుటుంబం వినియోగిస్తున్న స్థలానికి సంబంధించిన వాస్తవాలను రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖల ద్వారా సమగ్రంగా విచారించాలని కోరారు. స్థలంలో మతపరమైన నిర్మాణం లేదా విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందస్తు చర్యలు తీసుకుని గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

# భూ ఆక్రమణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల పట్టణంలోని సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో పెట్రోల్, డీజిల్ ఔట్‌లెట్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పాత భవనానికి మరమ్మతులు చేయాల్సిన ప్రభుత్వం కూల్చివేతకు ఎందుకు పూనుకుందని ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ బంక్



ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. సర్వే నంబర్ 138లోని భూమికి సంబంధించిన లీజ్ అగ్రిమెంట్, టెండర్ నిబంధనలు, జీవో ఎంఎస్ నంబర్ 575 అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ భూమికి సంబంధించిన పూర్తి ఫైల్‌ను కలెక్టర్ పరిశీలించి, ఎస్పీతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు, నేత కార్మికుల కోసం ప్రభుత్వం చేసిన పనులను వివరించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బీడీ కార్మికులు, నేత కార్మికుల సమస్యలను పరిష్కరించి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తుల పరిరక్షణపై ప్రజా సంఘాలు, మేధావులు దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.




## అడ్డులేని మొరం తవ్వకాలు

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): జిల్లాలో మొరం, మట్టి అక్రమ తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టలు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అనే తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తవ్విన మొరం, మట్టిని వెంచర్లు, భవన నిర్మాణాలకు తరలించి ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు పలు మున్సిపాలిటీల పరిధిలో మొరం విక్రయాలు సిండికేట్‌గా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్న ప్రాంతాల్లోనే తవ్వకాలు జరపాల్సి ఉండగా.. అనుమతులు లేని ప్రాంతాల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గుట్టలను తవ్వేందుకు అవసరమైన అనుమతులు లేకపోయినా కొన్ని ప్రాంతాల్లో యంత్రాలతో మట్టి, మొరం తరలిస్తున్నారని చెబుతున్నారు. అక్రమ తవ్వకాలపై సంబంధిత అధికారులకు సమాచారం అందించినా సకాలంలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు కదులుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పర్యావరణ, మైనింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వేములవాడ రూరల్ ఆలయాల్లో చోరీలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. నూకలమర్రి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం, పెద్దమ్మ దేవాలయంతో పాటు బాలరాజుపల్లి గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి చోరీ చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆలయాల్లో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించి ఆధారాలను సేకరించారు. ఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. చోరీలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి పట్టుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సంఘటనా స్థలాలు, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు




పేర్కొన్నారు. ఆలయాల వద్ద భద్రత విషయంలో ప్రజలు, ఆలయ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.



## సీఎం సభకు విజయవంతం చేయాలి: వీహెచ్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు వి. హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని హనుమంతరావు తెలిపారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో మున్నూరు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి పోనిశెట్టి శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎర్రం మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నామాల పోశెట్టి, జిల్లా ప్రచార కార్యదర్శి బొప్ప బిక్షపతి పటేల్, వేములవాడ పట్టణ సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య పటేల్, పటేల్ సంఘం అధ్యక్షుడు సారా శ్రీనివాస్ పటేల్, బోనాల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శంకర్ పటేల్, సాసాల రాజారాం పటేల్, చింతపంటి లక్ష్మీరాజ్యం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎస్ఐఆర్ ప్రక్రియలో అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలకు నిరసనగా రాజీనామా చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఆర్వో ప్రసాద్, ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ 2002లో ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో ధ్రువపత్రాలు సమర్పించినా మళ్లీ నోటీసులు రావడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎల్వోలకు సరైన పత్రాలు అందించినప్పటికీ నోటీసులు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధాన ఆయుధమని, ఓట్ల తొలగింపు, గల్లంతు అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తనకు, మాజీ మంత్రి రాజేశం గౌడ్‌కు కూడా నోటీసులు వచ్చాయని, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్



పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ నాయకులు కృష్ణారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మన్సూర్, బండ శంకర్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మార్కెట్ చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం: ఏసీఎస్ రాజు

జగిత్యాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తా సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక కరీంనగర్ విభాగ సంయోజక్ చిట్ల గంగాధర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్కినపల్లి కాశీనాథం మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ధైర్యానికి, దేశభక్తికి



ప్రతిరూపమని అన్నారు. 23 ఏళ్ల చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశ సమగ్రత, రక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, నాయకులు, కార్యకర్తలు, భగత్‌సింగ్ యువసేన సభ్యులు, 40వ వార్డు ప్రజలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ‘9వ ప్యాకేజీ పనులు తక్షణమే పూర్తి చేయాలి’

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): 9వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేసి మద్దిమల్ల రాయిని చెరువుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ‘రైతుల పక్షాన బీజేపీ గళం’ పాదయాత్ర ప్రారంభమైంది. బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో సోమవారం వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో పాదయాత్రను ప్రారంభించారు. మద్దిమల్ల గ్రామం నుంచి వీర్నపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు 9వ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి మద్దిమల్ల రాయిని చెరువుకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవాపురం లక్ష్మీ నరసయ్య రైతులకు మద్దతుగా పాల్గొన్నారు.




బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, పదాధికారులు, వివిధ మండలాల అధ్యక్షులు, పదాధికారులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం

వేములవాడ, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషాను ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది. అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని, వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.



## భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, మొక్కుబడుల్లో భాగంగా కోడెలను కట్టి సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అన్నపూజలు, కుంకుమ పూజలతోపాటు వివిధ రకాల నోములు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దర్శనం వేగంగా, సులభంగా జరిగేలా ఆలయ అధికారులు, సిబ్బంది ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మట్టి కాదు.. మాణిక్యం!



## సిరామిక్‌కు అసలైన అర్థం.. శరీర భాగాలను అతికించే ఇంప్లాంట్ల తయారీ

### సీఎస్ఐఆర్-సీజీసీఆర్ఐ ఘనతలు కోకొల్లలు



సిరామిక్ అంటే ఏమిటి? అని అడిగితే చాలామందికి గుర్తొచ్చేవి వాష్‌బేసిన్, మరుగుదొడ్డి తొట్టి, టైల్స్, కప్పులు, ప్లేట్లు. ఇల్లు నిర్మించుకునే సమయంలో బాత్‌రూమ్‌లో కనిపించే పదార్థంగానే సిరామిక్‌ను సాధారణంగా చూస్తాం. కానీ అదే సిరామిక్‌తో మనిషి శరీరంలో అమర్చే కృత్రిమ కీళ్లు తయారవుతున్నాయని తెలుసా? వాష్‌బేసిన్ నుంచి వైద్య ఇంప్లాంట్ వరకు సిరామిక్ ప్రయాణం చిన్నది కాదు. ఇంట్లో బాత్‌రూమ్‌లో కనిపించే సిరామిక్ ఒకటి.. శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో రూపొందించే జీవ అనుకూల సిరామిక్ మరొకటి. గాజు, సిరామిక్‌లను మానవ శరీరంతో అనుసంధానిస్తూ సీఎస్ఐఆర్-సీజీసీఆర్ఐ (సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) చేస్తున్న పరిశోధనలతో భవిష్యత్తులో ఎముకలు, కీళ్లు, దంతాలు, ముఖ-దవడ భాగాలు, కపాల పునర్నిర్మాణం వంటి వైద్య రంగాల్లో అనేక స్వదేశీ పరిష్కారాలు లభిస్తున్నాయి. గాజు, సిరామిక్‌లను కేవలం నిర్మాణ సామగ్రిగా కాకుండా మానవ శరీరంతో అనుసంధానించగల వైద్య పదార్థాలుగా మలుస్తూ ఆ సంస్థ గొప్ప పరిశోధనలు సాగిస్తోంది.

కంటికి ఇంప్లాంట్..
తుంటికి కృత్రిమ కీలు..
ఎముకకు బయో బోన్..
దంతాలకు ప్రత్యేక పూత..
ఇలా అనేక శరీర భాగాలకు
'సిరామిక్' చేసే మేలు ఇంతింత కాదు..
అది మట్టి కాదు.. మన మేనులో
మరో ప్రత్యామ్నాయం..
అందుకు కోల్‌కతాలోని 'సీజీసీఆర్ఐ' వేదికైంది.



#### తుంటికి కృత్రిమ కీలు

సీజీసీఆర్ఐ అభివృద్ధి చేసిన సిరామిక్ ఆధారిత తుంటి కీలు ఇంప్లాంట్ వైద్య రంగంలో సంస్థ సాధించిన ముఖ్యమైన సాంకేతికతల్లో ఒకటి. తుంటి కీలు దెబ్బతిన్నప్పుడు దాని స్థానంలో అమర్చేందుకు సిరామిక్ పదార్థాలతో కృత్రిమ భాగాలను రూపొందించింది. సిరామిక్ ఫెమోరల్ హెడ్, పాలిథిలీన్ కప్పు కలయికతో కూడిన వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు, సిరామిక్-సిరామిక్ కీలు వ్యవస్థలపైనా పరిశోధనలు చేసింది. అల్యూమినా, జిర్కోనియా-టఫ్‌న్డ్ అల్యూమినా వంటి అధిక బలం కలిగిన సిరామిక్ పదార్థాలను ఇందుకోసం పరిశీలించింది.

#### కంటి గుంటకు ఇంప్లాంట్

కంటిని తొలగించాల్సిన పరిస్థితుల్లో కంటి గుంట ఖాళీగా ఉండకుండా, దాని నిర్మాణాన్ని నిలబెట్టేందుకు ఉపయోగించే హైడ్రాక్సీఅపటైట్ ఆధారిత ఆర్బిటల్ ఇంప్లాంట్‌ను కూడా సంస్థ అభివృద్ధి చేసింది. ఇది కృత్రిమ కన్ను కంటే భిన్నమైనది. కన్ను ఉండే ఎముక గుంటలో అమర్చే ఇంప్లాంట్‌గా పనిచేస్తుంది. ఈ సాంకేతికతపై క్లినికల్ పరీక్షలు కూడా నిర్వహించినట్లు సీజీసీఆర్ఐ శాస్త్రవేత్తలు తెలిపారు.

#### ఎముకకు ప్రత్యామ్నాయంగా సిరామిక్

ఎముకలో ఏర్పడిన లోపాలను పూడ్చేందుకు సింథటిక్ బోన్ గ్రాఫ్ట్ పదార్థాలు, కాల్షియం ఫాస్ఫేట్, బయోయాక్టివ్ సిరామిక్‌లను అభివృద్ధి చేసింది. ఎముక కణజాలం పెరిగేందుకు అనుకూలంగా ఉండే రంధ్రాలతో కూడిన సిరామిక్ స్కాఫోల్డ్‌లపైనా పరిశోధనలు జరిగాయి. అవసరమైన ప్రాంతంలో కొత్త ఎముక కణజాలం ఏర్పడేందుకు ఆధారంగా నిలిచేలా వీటిని రూపొందిస్తున్నారు.

#### దంత ఇంప్లాంట్లకూ ప్రత్యేక పూత

దంత వైద్య రంగంలోనూ సీజీసీఆర్ఐ పరిశోధనలు విస్తరించాయి. దంత ఇంప్లాంట్లపై ఉపయోగించేందుకు బయోయాక్టివ్ గ్లాస్ పూత సాంకేతికతను అభివృద్ధి చేసింది. శరీరంలోని ఎముకతో ఇంప్లాంట్ అనుసంధానం మెరుగుపడేలా ఇలాంటి పూతలు పనిచేసే విధానంపై పరిశోధనలు జరిగాయి. శరీరంలో అమర్చే లోహపు ఇంప్లాంట్లపై హైడ్రాక్సీఅపటైట్ పూత వేసే సాంకేతికతను కూడా అభివృద్ధి చేసింది.



#### గాయాల నుంచి ఎముక ఇన్ఫెక్షన్ల వరకు

బయోయాక్టివ్ గ్లాస్‌తో గాయాల సంరక్షణకు ఉపయోగపడే పదార్థాలు, రక్తస్రావ నియంత్రణకు సహాయపడే పదార్థాలపైనా పరిశోధనలు కొనసాగుతున్నాయి. అలాగే ఎముకల్లో వచ్చే ఇన్ఫెక్షన్లకు అవసరమైన మందును నేరుగా ప్రభావిత ప్రాంతంలోకి చేరవేసేలా సిరామిక్ ఆధారిత ఔషధ విడుదల వ్యవస్థలపై కూడా పరిశోధనలు చేసింది.

#### రోగి శరీరానికి తగ్గట్టుగా..

కపాల పునర్నిర్మాణం, ముఖ-దవడ ఎముకలు, దంతాలు, ఎముక-కీళ్ల పునర్నిర్మాణం వంటి అవసరాలకు వ్యక్తికి అనుగుణంగా తయారు చేసే బయోసిరామిక్ ఇంప్లాంట్ల అభివృద్ధిపైనా సీజీసీఆర్ఐ దృష్టి సారించింది. రోగి శరీర నిర్మాణానికి సరిపోయేలా ఇంప్లాంట్లను రూపొందించడం ఈ పరిశోధనల్లో ప్రధాన లక్ష్యం. గాజు, సిరామిక్ వంటి పదార్థాలను వైద్య సాంకేతికతతో అనుసంధానిస్తూ సాగుతున్న ఈ పరిశోధనలు భారతీయ వైద్య పరికరాల స్వదేశీ అభివృద్ధికి దోహదపడుతున్నాయి.

**(పీఐబీ - హైదరాబాద్, పీఐబీ - కోల్‌కతా సహకారంతో..)**

---



గుండె జబ్బులు వృద్ధాప్య సమస్య మాత్రమే కాదని.. మారుతున్న జీవనశైలి కారణంగా యువతలోనూ గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి తెలిపారు. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక ఒత్తిడి, నిద్రలేమి, పొగతాగడం వంటి అలవాట్లు గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 29న నిర్వహించే ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రజలు గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు)

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

# యువతా.. గుండె జాగ్రత్త!



గుండెను కాపాడుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం.

మారుతున్న జీవనశైలితో పెరుగుతున్న గుండె సమస్యలు

ముషీరాబాద్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి



#### రోజూ వ్యాయామం తప్పనిసరి

రోజువారీ జీవితంలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ మనోజ్ రెడ్డి సూచించారు. నడక, జాగింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలను అలవాటుగా మార్చుకోవాలని.. సాధ్యమైనంత వరకు రోజుకు కనీసం 30 నిమిషాల శారీరక శ్రమ చేయడం మంచిదన్నారు. దీనివల్ల శరీర బరువు, రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాలను నియంత్రించుకోవచ్చని తెలిపారు.

#### ఆహారంపై అప్రమత్తత అవసరం

అధిక ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు, జంక్‌ఫుడ్, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించాలని సూచించారు. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు వంటి పోషకాహారాన్ని ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు.

#### ఒత్తిడి.. నిద్రలేమి వద్దు

అధిక పని ఒత్తిడి, రాత్రివేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం, తగినంత నిద్ర లేకపోవడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. పెద్దలు సాధారణంగా 7--8 గంటల నాణ్యమైన నిద్ర పొందేలా చూసుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, శ్వాసాభ్యాసాలు, నడక వంటి కార్యక్రమాలు ఒత్తిడిని నియంత్రించడంలో సహాయపడతాయని చెప్పారు.

#### పొగాకుకు దూరంగా ఉండాలి

పొగతాగడం, పొగాకు ఉత్పత్తుల వినియోగం గుండె ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి పొగతాగడం పూర్తిగా మానేయడం ముఖ్యమన్నారు.

#### బీపీ.. షుగర్.. కొలెస్ట్రాల్‌పై నిఘా

అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు వంటి సమస్యలు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయని తెలిపారు. అవసరాన్ని బట్టి వైద్యుల సలహాతో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

#### లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

ఛాతీలో నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణంగా చెమటలు పట్టడం, అకస్మాత్తుగా తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని డాక్టర్ మనోజ్ రెడ్డి సూచించారు.

#### "గుండె ఆరోగ్యం.. మన బాధ్యత"

"గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆరోగ్యకరమైన నిర్ణయాలే మన భవిష్యత్తు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ, పొగాకుకు దూరంగా ఉండటం, అవసరమైన ఆరోగ్య పరీక్షలు---ఇవే ఆరోగ్యకరమైన హృదయానికి ముఖ్యమైన పునాదులు" అని డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, కుటుంబ సభ్యులు మరియు సమాజంలోనూ గుండె జబ్బుల నివారణపై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.



## వయ్యారి చిత్రం


దివ్య భారతి

## రకుల్ ఫ్యామిలీపై ఐటీ దాడులు



స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి ఊహించని కారణాలతో ఇంటర్నెట్ లో చర్చగా మారింది. రకుల్.. తన మామ, ప్రముఖ సినీనిర్మాత వాషు భగ్నాని.., అలాగే ముంబైలోని పనోరమా స్టూడియోస్‌తో సంబంధం ఉన్న పలు స్థావరాలపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. 28 సెప్టెంబర్ 2026న ముంబైలోని మొత్తం 12 ప్రాంతాలలో ఈ సోదాలు ప్రారంభమయ్యాయి. అనుమానాస్పద నిధుల అక్రమాల నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాల నిర్మాణం- ఫైనాన్సింగ్ ముసుగులో నిధులను అక్రమంగా విదేశాలకు మళ్లించారనే ఆరోపణలపై ముంబై ఐటీ శాఖ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ముంబై ఆదాయపు పన్ను శాఖకు చెందిన పలు ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. వీరు సంబంధిత ప్రాంగణాల్లోని పత్రాలు, ఆర్థిక రికార్డులు, విదేశాలకు బదిలీ అయినట్టు భావిస్తున్న లావాదేవీల వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. అయితే ఈ సోదాలకు సంబంధించి ఇప్పటివరకు ఎంత మొత్తం ప్రమేయం ఉందనే వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించలేదు. ఈ కుటుంబ సంబంధాల విషయానికి వస్తే.. నిర్మాత వాషు భగ్నాని కుమారుడు జాకీ భగ్నానీని నటి రకుల్ ప్రీత్ సింగ్ వివాహం చేసుకున్నారు. భగ్నాని కుటుంబం పూజా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో సంబంధం కలిగి ఉండగా, కుమార్ మంగత్‌కు చెందిన పనోరమా స్టూడియోస్ కూడా హిందీ చిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థగా కొనసాగుతోంది. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌లో వస్తున్న దృశ్యం: ది కన్‌క్లూజన్ చిత్రం అక్టోబర్ 2న థియేటర్లలో విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతానికి ఐటీ శాఖ ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను లేదా ఎటువంటి పన్ను ఉల్లంఘనలు జరిగాయనే విషయాలను బహిరంగంగా వెల్లడించలేదు. ఈ సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉంది.

## త్రివిక్రమ్ అయితే స్క్రిప్ట్ కూడా వినను



అందరి ఆసక్తి ఆదర్శకుటుంబంపైనే. వెంకీ మామ- త్రివిక్రమ్ కాంబినేషన్ మరోసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తోందో చూడాలనే ఉత్సాహం అందరిలో ఉంది. ఈ సినిమా ప్రమోషన్స్ ఇప్పటికే మొదలయ్యాయి. ఆదర్శ కుటుంబం సినిమా నుంచి నారాయణమ్మ.. పాటను లాంచ్ చేసారు. ఈ వేడుకలో హీరోయిన్లు నివేదా పేతురాజ్, శ్రీనిధి శెట్టి , డింపుల్ హయాతి తమ అందచందాలు, అద్భుతమైన ఫన్నీ స్పీచ్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. వారు అందించిన కొత్త విషయాలు సినిమాపై మరింతగా అంచనాలను పెంచాయి. అల వైకుంఠపురములో చిత్రం తనకు మంచి బ్రేక్ ఇచ్చిందని.. త్రివిక్రమ్ గారు పిలిస్తే స్క్రిప్ట్ కూడా వినకుండా సినిమా ఒప్పుకునే దర్శకులలో ఆయన మొదటివారని నివేదా పేతురాజ్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ గారితో పనిచేయాలనే తన చిరకాల కోరిక నెరవేరిందని..ఆయన మానిటర్ ముందు చేసే మ్యాజిక్ ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. వెంకటేష్ గారు, శ్రీనిధి, డింపుల్ అందరూ మంచి పాజిటివ్ వైబ్స్ ఇచ్చారని., ఈ ఎంటైర్ టీమ్‌తో పనిచేయడం చాలా సరదాగా గడిచిందని అన్నారు.

## సినిమాల కోసమే సీక్రెట్ మ్యారేజ్



సొట్టబుగ్గల సుందరి తాప్సి వివాహం జరిగి రెండేళ్లు దాటిన ఇప్పటి వరకు చాలా మందికి కనీసం ఆమె పెళ్లి అయినట్లుగా కూడా తెలియదు. పెళ్లి వైభవంగా ఉదయ్ పూర్ కోటలో జరిగినప్పటికీ మీడియాలో కవరేజ్ రాకుండా చూసుకుంది. అంతే కాకుండా సోషల్ మీడియాలో ఎక్కడ తన పెళ్లి ఫోటోలు కనిపించకుండా చూసింది. ఒకటి రెండు పెళ్లి ఫోటోలు, వీడియోలు ఉన్నా తన టీం తో తీసి వేయించింది అనే టాక్ వచ్చింది. అధికారికంగా కూడా తాప్సి కనీసం ఒక్క ఫోటోను కూడా షేర్ చేయలేదు. కొందరు పెళ్లికి హాజరు అయిన గెస్ట్‌లు షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు సైతం సోషల్ మీడియాలో కనిపించకుండా తాప్సి అండ్ టీం జాగ్రత్త పడ్డట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. తాప్సి పెళ్లిని అంత సీక్రెట్‌గా ఉంచాల్సిన అవసరం ఏం వచ్చిందని చాలా మంది ఇప్పటికీ ప్రశ్నిస్తున్నారు. తాప్సి సీక్రెట్ వివాహం వెనుక ఉద్దేశం ఏంటి అనేది స్పష్టంగా తెలియకపోయినా సోషల్ మీడియాలో రకరకాలుగా పుకార్లు షికార్లు చేశాయి. వాటన్నింటికి ఫుల్ స్టాప్ పెట్టే విధంగా తాప్సి క్లారిటీ ఇచ్చింది. తాను సినిమా జీవితంను, వ్యక్తిగత జీవితంను వేరు వేరుగా ఉంచాలి అనుకున్నాను. అందుకే నా పెళ్లికి సంబంధించినంత వరకు వ్యక్తిగత కార్యక్రమంగా మాత్రమే జరిగింది. ఇండస్ట్రీకి ఏమాత్రం సంబంధం లేని కార్యక్రమం అన్నట్లుగానే సాగిందని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా పెళ్లి ఫోటోలను షేర్ చేయడం ద్వారా ప్రైవసీ దెబ్బ తింటుందని భావించినట్లు పేర్కొంది. పెళ్లి అనేది పూర్తిగా నా వ్యక్తిగత విషయం. కనుక ఆ విషయాన్ని నేను బయటకు చెప్పొద్దు అనుకున్నాను. నేను ఏదో భయపడి పెళ్లి ఫోటోలను షేర్ చేయలేదని కొందరు అనుకుంటున్నారు. అందంతా నిజం కాదు. సినిమా ఇండస్ట్రీకి పూర్తి దూరంగా తన వ్యక్తిగత జీవితం ఉండాలని భావించినట్లుగా చెప్పుకొచ్చింది.

## వయసు మళ్లితేనేం?



బాలీవుడ్‌లో విలక్షణ నటిగా, ధైర్యమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న రాధికా ఆప్టే తాజాగా 'లస్ట్ స్టోరీస్ 3' సిరీస్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఇటీవలే 41వ పడిలోకి అడుగుపెట్టిన రాధిక ఈ ప్రాజెక్ట్‌లో 40 ఏళ్ల వయసున్న మహిళ కోరికలు, లైంగికతను ప్రతిబింబించే పాత్రలో నటించారు. ఈ సందర్భంగా సమాజంలో వయసు మళ్లడం , మహిళల లైంగికతపై ఉన్న సామాజిక అపోహలు పై రాధికా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమాజంలో వయసు పెరగడాన్ని ఏదో కోల్పోవడంగా చూడటంపై రాధికా అసంతృప్తి వ్యక్తం చేశారు. మన సమాజం వయసు పట్ల ఎంతో విచక్షణ చూపుతుంది. కానీ నాకు 41 ఏళ్లు వచ్చిన సమయంలో నా 20లు , 30ల వయసు కంటే కూడా ఇప్పుడే నా శరీరం, నా అవసరాల గురించి మరింత స్పష్టమైన అవగాహన వచ్చింది. 20లలో తల్లిదండ్రులు వద్దన్న పనులు చేయడంలో.. 30లలో వారి మాటలే నిజమేమో అని భయపడటంలో గడిపోతుంది. కానీ 40లలో సొంత స్థానాన్ని, జీవితంపై స్పష్టతను కనుగొంటాం అని వ్యాఖ్యానించారు. తన జీవితంలో అత్యంత చైతన్యవంతంగా, యంగ్‌గా అనిపించేది 40లలోనే అని రాధికా నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఈ వయసే కోరికలు, అవసరాలను గుర్తించడంలో అత్యుత్తమ సమయం. ముఖ్యంగా మాతృత్వం అనుభవంలోకి వచ్చాక, శరీరం పూర్తిగా మారుతుంది . మన శరీర అవసరాలు ఏంటో? స్పష్టంగా అర్థమవుతాయి. వయసు పెరగడం వల్ల వచ్చే పరిపక్వతను గుర్తించని వారు నిజంగా జీవితంలో చాలా విషయాలను మిస్ అవుతున్నారు అని చెప్పుకొచ్చారు. భారతీయ సమాజంలో లైంగికత , కోరికల గురించి మాట్లాడటం ఇంకా పెద్ద టా...గా ఉండిపోయిందని అభి ప్రాయపడ్డారు. లైంగికత పక్కనబెడితే, ప్రాథమిక సమానత్వం , స్వేచ్ఛగా ఆలోచించి మాట్లాడే వాతావరణం కూడా ఇంకా చాలా చోట్ల లేదు. చిన్నప్పుడు లైంగికత అంటే అదొక చెడు విషయం అనే భావనతోనే నేను కూడా పెరిగాను. కానీ పురుషుల కోరికలను ఒకలా, మహిళల కోరికలను మరొకలా ఎందుకు వేరు చేసి చూడాలి? అది ఇద్దరూ కలిసి పంచుకునే సహజమైన భావన? కదా అని ప్రశ్నించారు. ఒక తల్లిగా కుమార్తె పెంపకం విషయంలో పూర్తి స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని అందించాలనుకుంటున్నట్లు రాధికా తెలిపారు.

## ఫౌజీ బ్యూటీ సైలెన్స్ ఎందుకో..!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న ఫౌజీ సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మైల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలో రేసులో ఉన్నా వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేసారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్ తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది ఫౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో సీతారామంతో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీ పై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. ఫౌజీ అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు.

## మలేషియాలో కీర్తి సురేష్ సినిమా బ్యాన్



కార్తిక్ సుబ్బరాజ్ సినిమా అంటేనే అందులో ఊహించని ట్విస్టులు ఉంటాయని ఆడియన్స్ ముందే ఫిక్స్ అవుతారు. కానీ ఆయన లేటెస్ట్ మూవీ 'దోరతి' విషయంలో ఆ మలుపులే ఇప్పుడు సినిమాను మించి హాట్ టాపిక్ గా మారాయి. చిన్ననాటి స్నేహితులు, జెండర్ ఐడెంటిటీ, కీర్తి సురేష్ క్యారెక్టర్.. అంటూ సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి రాకరకల అభిప్రాయాలు ట్రెండ్ అవుతున్నాయి. బోల్డ్ ఎలిమెంట్స్ తో వచ్చిన ఈ సినిమా రిలీజ్ కు ముందు నుంచే ఒక బజ్ క్రియేట్ చేస్తోంది. ఇండియాలో ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చింది. సినిమాలో అడల్ట్ డోస్ గట్టిగానే ఉందన్న సంగతి జనాలకు ముందే తెలుసు. కథ తీసుకున్న బోల్డ్ టర్న్ చూసి ఒక వర్గం ఆడియన్స్ షాక్ అవుతుంటే, ఇంకో వర్గం మాత్రం డైరెక్టర్ గట్స్ ను మెచ్చుకుంటోంది. ఇండియాలో ఈ డివైడ్ టాక్ నడుస్తుండగానే, ఇప్పుడు ఓవర్సీస్ నుంచి వచ్చిన ఒక ఊహించని న్యూస్ దోరతి చుట్టూ కొత్త సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మలేషియాలో దోరతి సినిమా థియేట్రికల్ రిలీజ్ కు అక్కడి సెన్సార్ అధికారులు బ్రేకులు వేశారు. స్క్రీనింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవడంతో అక్కడ ప్లాన్ చేసిన రిలీజ్ మొత్తం ఆగిపోయింది.

## బస్సు దిగుతూ పడిపోయిన రోహిత్

టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వెస్టిండీస్‌తో తొలి వన్డే ముగిసిన అనంతరం హోటల్‌కు తిరిగి వస్తున్న సమయంలో టీమ్ బస్సు దిగుతూ హిట్‌మ్యాన్ కాలుజారి కింద పడ్డాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటన జరిగినప్పుడు సమీపంలోనే ఉన్న విరాట్ కోహ్లీ ఆందోళనగా స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. వివరాల్లోకి వెళితే.. తిరువనంతపురంలో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నిన్న రాత్రి మ్యాచ్ ముగిశాక జట్టు హోటల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో బస్సు మెట్లపై రోహిత్ శర్మ పట్టుతప్పి కింద పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన సహాయక సిబ్బంది, అక్కడే ఉన్న పోలీసులు అతడిని పైకి లేపారు. ఈ ఘటనలో రోహిత్‌కు ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాగా, ఈ మ్యాచ్‌లో రోహిత్ 32 పరుగులు చేయగా, విరాట్ కోహ్లీ 139 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే సెప్టెంబర్ 30న గువాహటిలో జరగనుంది.






## సచిన్‌తో పోలిక వద్దు: కోహ్లీ

టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన పరుగుల దాహాన్ని కొనసాగిస్తున్నాడు. వెస్టిండీస్‌తో నిన్న తిరువనంతపురంలో జరిగిన మొదటి వన్డేలో అద్భుత శతకంతో చెలరేగిన కోహ్లీ, భారత జట్టుకు ఘన విజయాన్ని అందించడమే కాకుండా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రెండు ప్రధాన రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 88 బంతుల్లోనే 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో భాగంగా కోహ్లీ వన్డే క్రికెట్‌లో 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు సచిన్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. అయితే, కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును చేరగా, సచిన్‌కు దీనికోసం 377 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. అంటే.. సచిన్ కంటే 74 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి ఈ రికార్డును కోహ్లీ సొంతం చేసుకోవడం విశేషం. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును కూడా అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ (6,976) పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌తో కోహ్లీ స్వదేశంలో 7,006 పరుగులు పూర్తి చేసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇది కోహ్లీకి వన్డేల్లో 55వ సెంచరీ కాగా, లిస్ట్-ఏ క్రికెట్‌లో 60వ శతకం. ఈ క్రమంలో లిస్ట్-ఏ సెంచరీల విషయంలోనూ సచిన్ రికార్డును సమం చేశాడు. మ్యాచ్ అనంతరం తన రికార్డులు, సచిన్‌తో పోలికలపై కోహ్లీ వినమ్రంగా స్పందించాడు. "నాకు సచిన్ పాజీ ఎప్పటికీ సచిన్ పాజీనే. అతను తన కాలంలో ఆటలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. అది సంఖ్యలు, పోలికలకు అతీతమైన విషయం. ప్రజలపై అతను చూపిన ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించాడు.

## 55వ సెంచరీతో గవాస్కర్ సరసన కోహ్లీ!

పరుగుల యంత్రం, ఛేదనల రారాజు విరాట్ కోహ్లీ తన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిని చేర్చుకున్నాడు. అద్వితీయ ఫామ్‌ను కొనసాగిస్తూ వన్డే కెరీర్‌లో 55వ శతకాన్ని బాదడమే కాకుండా, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ పేరిట ఉన్న ఓ చారిత్రక రికార్డును సమం చేశాడు. కోహ్లీ అజేయ శతకంతో (139బి) కదం తొక్కడంతో వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**కింగ్ కోహ్లీ రికార్డుల మోత!**

వెస్టిండీస్ నిర్దేశించిన 296 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీ ఆడిన ఇన్నింగ్స్ అతడి క్లాస్‌కు నిలువుటద్దం పట్టింది. కేవలం 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లతో 139 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన విరాట్, ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

**గవాస్కర్ సరసన:** ఈ సెంచరీతో కోహ్లీ, ఒకే ప్రత్యర్థిపై (వెస్టిండీస్) అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు (13) చేసిన భారత ఆటగాడిగా సునీల్ గవాస్కర్ రికార్డును సమం చేశాడు.

**మైలురాయి 55:** ఇది విరాట్ కోహ్లీకి వన్డే ఫార్మాట్‌లో 55వ సెంచరీ కావడం విశేషం.

**వేగవంతమైన 15వేల పరుగులు:** ఇదే మ్యాచ్‌లో కోహ్లీ వన్డేల్లో అత్యంత వేగంగా (303 ఇన్నింగ్స్‌లు) 15,000 పరుగుల మైలురాయిని అందుకుని, సచిన్ టెండూల్కర్ (377 ఇన్నింగ్స్‌లు) రికార్డును బద్దలు కొట్టాడు.

**ఛేదనలో రారాజు:** విజయవంతమైన ఛేదనలో కోహ్లీకి ఇది 25వ శతకం కావడం అతని నిలకడకు నిదర్శనం.

# స్వర్ణం.. ఎదురుచూపులే






**ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్ ఈషా సింగ్ సత్తా చాటింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించింది. సోమవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో స్వర్ణం కోసం చివరి వరకు పోరాడిన ఈషా.. టై బ్రేకర్‌లో చైనా షూటర్ జియావో చేతిలో పరాజయం పాలైంది.**

**21 ఏళ్ల ఈషా ఫైనల్లో ఏకంగా ఆరు షూటాఫ్‌లు ఎదుర్కొంది. ఇందులో నాలుగు సిల్వర్, బ్రాంజ్ కోసం జరిగిన పోరు కాగా.. మరో రెండు షూటాఫ్‌లు స్వర్ణం కోసం జరిగాయి.**

2026 ఆసియా క్రీడల్లో భారత షూటింగ్ సంచలనం ఈషా సింగ్ అద్భుత ప్రదర్శనతో మెరిసింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో అసాధారణ రీతిలో పుంజుకుని ఇండియాకు రజత పతకాన్ని అందించి ప్రశంసలు అందుకుంటోంది. క్వాలిఫైయిండ్ రౌండ్లో ప్రతిభావంతులైన షూటర్లు మను భాకర్, రాహి నిష్క్రమించడంతో భారత్ ఆశలన్నీ ఈషా సింగ్‌పైనే నిలిచాయి. మొత్తం 44 మంది షూటర్లు పాల్గొన్న ఈ క్వాలిఫైయింగ్ రౌండ్లో ఈషా సింగ్ తీవ్రమైన పోటీని ఎదుర్కొని ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. చైనీస్ తైపీకి చెందిన యెన్-చింగ్ చెంగ్‌తో స్కోరు సమమైనప్పటికీ.. 22 బుల్‌సైలను కొట్టడం ద్వారా ఈషా సింగ్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఫైనల్ రౌండ్లో ప్రారంభంలో కొద్దిగా ఫామ్ తప్పిన ఈషా సింగ్ నాలుగో స్థానానికి పడిపోయింది. అయితే ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఏకాగ్రతతో వరుస షాట్లలో రాణించింది. తొమ్మిది సిరీస్‌ల పూర్తయ్యేసరికి కొరియన్ షూటర్‌తో కలిసి 34 పాయింట్లతో సమంగా నిలిచింది. దీంతో జరిగి కాంస్య పతక షూట్-అప్‌లో విజయం సాధించి స్వర్ణం/రజతం రేసులోకి దూసుకెళ్లింది. ఫైనల్ సిరీస్‌లో ఈషా సింగ్ ఐదు లక్ష్యాలలో నాలుగుంటిని ఛేదించగా.. చైనా షూటర్ మూడు మాత్రమే కొట్టింది. దీంతో ఇద్దరి స్కోర్లు 38-38తో సమమయ్యాయి. అనంతరం విజేతను నిర్ణయించడానికి నిర్వహించిన చివరి షూట్-అప్ లో చైనా క్రీడాకారిణి స్వల్ప తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకోగా.. ఈషా సింగ్ రజత పతకాన్ని కైవసం చేసుకుంది. చివరివరకూ చూపిన అసమాన పోరాట పటిమతో ఈ రజతం కూడా స్వర్ణానికి ఏ మాత్రం తీసిపోని విధంగా నిలిచింది. కురాష్ 78 కిలోల విభాగంలో భారత అథ్లెట్ పింకీ బల్హారాకు కాంస్య పతకం దక్కింది. సెమీ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన అథ్లెట్‌పై పింకీ 0-5 తేడాతో ఓటమి పాలైంది. మరోవైపు ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ 75 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన సియోంగ్ సుయోన్‌పై విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడల బాక్సింగ్ పోటీలో వరుసగా తన రెండో పతకాన్ని ఖాయం చేసుకుంది. టోర్నమెంట్‌లో తన మొదటి బౌట్‌లోనే పోటీపడిన లవ్లీనా.. సియోంగ్‌ను 5-0 తేడాతో ఓడించి చివరి నాలుగు స్థానాలకు దూసుకెళ్లింది. దీంతో ఆమె కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది.










# సెమీస్‌కు టీమిండియా

## ఆసియా క్రీడల్లో వర్షం ఎఫెక్ట్.. భారత్-ఆఫ్ఘనిస్థాన్ క్వార్టర్ ఫైనల్ రద్దు

ఆసియా క్రీడల్లో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న టీమిండియా నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. కరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఉదయం 5:30 గంటలకు జరగాల్సిన పాకిస్థాన్-హాంకాంగ్ తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే కారణంతో రద్దయింది. ఆ మ్యాచ్‌లోనూ అధిక ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీస్‌కు చేరుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా.. ఆఫ్ఘనిస్థాన్ 10వ స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్థాన్ 6వ ర్యాంకులో, హాంకాంగ్ 24వ ర్యాంకులో కొనసాగుతున్నాయి. ఈ నిబంధనల ప్రకారమే భారత్, పాక్ జట్లు ముందంజ వేశాయి. సెమీఫైనల్లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడుతుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్, మలేషియా మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ విజేతతో పాకిస్థాన్ పోటీ పడుతుంది. మిగిలిన క్వార్టర్ ఫైనల్స్ మంగళవారం, సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి.

**అటు.. పాక్ కూడా**

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో పాకిస్థాన్ జట్టు ఒక్క బంతి కూడా పడకుండానే సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం హాంగ్‌కాంగ్‌తో జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అడ్డుపడటంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న పాకిస్థాన్ నేరుగా సెమీస్‌కు అర్హత సాధించింది. నిషిన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా, భారీ వర్షం కారణంగా టాస్ కూడా వేయలేకపోయారు. మ్యాచ్ రద్దు కావడంతో పాకిస్థాన్ ముందంజ వేయగా, కనీసం పోటీపడే అవకాశం కూడా దక్కకుండా హాంగ్‌కాంగ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## కోహ్లీ సెంచరీ.. నాకు అవార్డు: కుల్దీప్

వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ప్రదర్శనతో 4 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, తనకు లభించిన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ అసాధారణ సెంచరీ తర్వాత ఆ అవార్డును అందుకోవడం తనకు కొంచెం ఇబ్బందిగా అనిపించిందని నిజాయతీగా అంగీకరించాడు. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ 10 ఓవర్లలో 40 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు తీశాడు. తొలుత 135 పరుగుల భారీ భాగస్వామ్యంతో దూసుకెళ్తున్న విండీస్ ఓపెనర్లను విడదీసింది కుల్దీపే. జాన్ క్యాంప్‌బెల్‌ను ఔట్ చేసిన తర్వాత కెప్టెన్ షాయ్ హోప్, సెంచరీ హీరో జస్టిన్ గ్రీవ్స్, జ్యువెల్ ఆండ్రూలను పెవిలియన్‌కు పంపి విండీస్ పరుగుల వేగానికి బ్రేకులు వేశాడు. అనంతరం ఛేదనలో విరాట్ కోహ్లీ (88 బంతుల్లో 139 నాటౌట్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (110) సెంచరీలతో చెలరేగడంతో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లోనే కోహ్లీ 15,000 పరుగుల మైలురాయిని కూడా దాటడం విశేషం. మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే శుభ్‌మన్, విరాట్ భాయ్ బ్యాటింగ్‌ను నేను చాలా ఆస్వాదించాను. ముఖ్యంగా విరాట్ ఆడిన తీరు అద్భుతం. అతడి అసాధారణ ఇన్నింగ్స్ చూశాక, ఈ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకోవడం నాకు ఇబ్బందిగా అనిపించింది" అని వ్యాఖ్యానించాడు. తన బౌలింగ్ ప్రదర్శన గురించి కుల్దీప్ వివరిస్తూ "నా బౌలింగ్ రిథమ్‌తో నేను చాలా సంతృప్తిగా ఉన్నాను. ప్రశాంతంగా, నాకు అనిపించిన విధంగా బౌలింగ్ చేశాను. పేస్, వేరియేషన్స్ అన్నీ చక్కగా కుదిరాయి. బ్యాటర్లను చదువుతూ బంతులు వేశాను. నా రిథమ్ చాలా బాగుంది" అని తెలిపాడు.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సభల సంబురాలేనా?

తెలంగాణ రాష్ట్రం ఏమైపోతోంది? ప్రజల సమస్యలు ఎటు పోతున్నాయి? పాలకుల దృష్టి ఏ వైపు ఉంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు సామాన్యుడిని వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ఉందంటే కేవలం సభలు పెట్టడం, ప్రసంగాలు చేయడం, ప్రతిపక్షంపై ఎదురుదాడి చేయడమేనా? ప్రజాస్వామ్య పాలనకు అసలు అర్థం ఇదేనా? అన్న సందేహం కలుగుతోంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునేది సభలు చూడటానికి కాదు. తమ బతుకుల్లో మార్పు కోసం. రైతుకు పంటకు గిట్టుబాటు ధర కావాలి. నిరుద్యోగికి ఉద్యోగం కావాలి. విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి. పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండాలి. మధ్యతరగతి కుటుంబానికి ధరల భారంతో ఊపిరాడని పరిస్థితి తొలగాలి. గ్రామాలకు తాగునీరు, సాగునీరు, రహదారులు కావాలి. పట్టణాలకు మౌలిక వసతులు కావాలి. ఇవే ప్రజల అసలు అజెండా. కాని రాజకీయ వాతావరణాన్ని చూస్తుంటే మరో చిత్రం కనిపిస్తోంది. ఒకవైపు ప్రభుత్వం తన పనితీరును వివరిస్తోంది. మరోవైపు ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. శాసనసభ సమావేశాల్లో కూడా ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ కంటే అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకుని ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ల వరకు వెళ్లాయి. ప్రతిపక్షం విమర్శిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ప్రభుత్వం తప్పు చేస్తే ప్రతిపక్షం ప్రశ్నించాలి. ఇదే ప్రజాస్వామ్య సూత్రం. కానీ ప్రశ్నకు సమాధానం విధానంతో రావాలి. విమర్శకు ప్రతివిమర్శతో కాదు. ఆరోపణకు మరో ఆరోపణతో కాదు. రాజకీయ ప్రత్యర్థిని ఇరుకున పెట్టడమే పరిపాలనగా మారితే ప్రజా సమస్యలు ఎక్కడ చర్చకు వస్తాయి? ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల ప్రారంభాలు, శంకుస్థాపనలు, భారీ సభలు రాజకీయ వ్యవస్థలో భాగమే. వాటికి కూడా ప్రజాస్వామ్యంలో స్థానం ఉంది. కానీ ప్రతి కార్యక్రమం ఒక రాజకీయ సభగా, ప్రతి ప్రసంగం ప్రతిపక్షంపై దాడిగా, ప్రతి నిర్ణయం రాజకీయ సందేశంగా మారితే పరిపాలన వెనుకబడే ప్రమాదం ఉంది. ప్రజాపాలన అంటే ప్రజల మధ్య ఉండటం. సచివాలయంలో ఫైళ్లను పరిష్కరించడం మాత్రమే కాదు; గ్రామాల్లో రైతు ఏం ఎదుర్కొంటున్నాడో తెలుసుకోవడం. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగికి ఏం జరుగుతోందో చూడటం. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఏ సమస్యలున్నాయో తెలుసుకోవడం. నిరుద్యోగ యువత భవిష్యత్తుపై ఏం ఆలోచిస్తోందో వినడం. పల్లెల్లో తాగునీటి పరిస్థితిని పరిశీలించడం. హైదరాబాద్‌లో రోడ్లు, మురుగు, రవాణా సమస్యలను పరిష్కరించడం. ప్రభుత్వం మాత్రం రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై పలు కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతోంది. ముఖ్యమంత్రి కూడా ప్రజాపాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం అని ఇటీవల స్పష్టం చేశారు. అదే నిజమైతే ఆ స్ఫూర్తి పాలనలోని ప్రతి స్థాయిలో కనిపించాలి. ప్రకటనల్లో మాత్రమే కాదు. ప్రజలకు కావాల్సింది ఎవరు ఎవరిని ఓడించారన్న రాజకీయ లెక్కలు కాదు. తమ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందన్న సమాధానం. నిరుద్యోగికి ఉద్యోగ ప్రకటన ఎప్పుడు వస్తుందో, రైతుకు పంటకు గిట్టుబాటు ధర ఎప్పుడు దక్కుతుందో, పేదవాడికి ఇల్లు ఎప్పుడు వస్తుందో, విద్యార్థికి ఫీజు సమస్య ఎప్పుడు తీరుతుందో, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం ఎప్పుడు మెరుగుపడుతుందో చెప్పగలిగే పాలన కావాలి. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడం రాజకీయ పార్టీల పని కావచ్చు. కానీ ప్రభుత్వాన్ని నడపడం పాలకుల బాధ్యత. ఈ రెండింటినీ కలిపేస్తేనే సమస్య మొదలవుతుంది. ప్రతిపక్షం చేసే ప్రతి విమర్శకు రాజకీయ సమాధానం వెతకడం కంటే, అందులో ప్రజా సమస్య ఏదైనా ఉంటే దానిని పరిష్కరించడం ముఖ్యం. అదే సమయంలో ప్రతిపక్షం కూడా ప్రజా సమస్యలను రాజకీయ ఆయుధాలుగా మాత్రమే కాకుండా పరిష్కారాల కోసం శాసనసభ వేదికగా ఉపయోగించాలి. తెలంగాణకు ఇప్పుడు సభల సంబురాల కంటే పాలనలో స్థిరత్వం అవసరం. ప్రసంగాల కంటే పరిష్కారాలు అవసరం. రాజకీయ ఆరోపణల కంటే బాధ్యత అవసరం. ప్రజల దృష్టి మరల్చే రాజకీయ విన్యాసాల కంటే వారి జీవితాల్లో కనిపించే మార్పు అవసరం. ప్రతి సభ ముగిసిన తర్వాత ప్రజలు ఒక్క ప్రశ్న వేసుకుంటారు.. "మా సమస్య ఏమైనా పరిష్కారమైందా?" ప్రతి ప్రభుత్వ కార్యక్రమం తర్వాత కూడా అదే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం రోడ్డు మీద కనిపించాలి, రైతు పొలంలో కనిపించాలి, విద్యార్థి పాఠశాలలో కనిపించాలి, రోగికి ఆసుపత్రిలో కనిపించాలి, నిరుద్యోగి చేతిలో ఉద్యోగ నియామక పత్రంగా కనిపించాలి. అధికారం శాశ్వతం కాదు. సభలు కూడా శాశ్వతం కావు. రాజకీయ ప్రత్యర్థులు మారుతారు. ప్రభుత్వాలు మారుతాయి. కానీ ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కోసం ఎదురు చూస్తూనే ఉంటాయి. అందుకే పాలకులకు ఒకటే గుర్తుండాలి.. ప్రతిపక్షాన్ని ఓడించడం రాజకీయ విజయం కావచ్చు.. కానీ ప్రజల సమస్యలను పరిష్కరించడమే పరిపాలనా విజయం.

# పంచ భూతాలు.. మానసిక ఒత్తిడి!



**ఆధునిక మానవ జీవితం ఎన్నడూ లేనంత వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, రవాణా విస్తరణ, వినియోగ సంస్కృతి, ఉద్యోగ పోటీ, ఆర్థిక ఒత్తిళ్లు మనిషి జీవన ప్రమాణాలను ఒకవైపు మెరుగుపరుస్తున్నప్పటికీ మరోవైపు గాలి, నీరు, ఆహారం, శబ్దం, వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిళ్ల రూపంలో తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. మనిషి ఆరోగ్యానికి మూలాధారాలైన గాలి, నీరు, ఆహారం నాణ్యత దెబ్బతింటే ఆధునిక అభివృద్ధి ఎంత వేగంగా సాగినా దాని ప్రయోజనం ప్రశ్నార్థకంగా మారుతుంది. మొదట గాలిని పరిశీలిస్తే ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద పర్యావరణ సమస్యల్లో వాయు కాలుష్యం ఒకటి.**



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్,
కాకతీయ యూనివర్సిటీ

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2019లో ప్రపంచ జనాభాలో సుమారు 99 శాతం మంది సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత మార్గదర్శక ప్రమాణాలను చేరుకోని ప్రాంతాల్లో నివసించారు. బాహ్య, గృహ వాయు కాలుష్యాల సమ్మిళిత ప్రభావం ప్రతి సంవత్సరం సుమారు 67 లక్షల అకాల మరణాలతో సంబంధం కలిగి ఉంది. బాహ్య వాయు కాలుష్యం ఒక్కటే 2019లో సుమారు 42 లక్షల అకాల మరణాలకు కారణమైనట్లు అంచనా. ఈ మరణాల్లో సుమారు 89 శాతం తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో నమోదయ్యాయి. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే గాలి కాలుష్యం కేవలం ఊపిరితిత్తుల సమస్యగా చూడలేం. సూక్ష్మ ధూళికణాలు శ్వాసకోశ వ్యవస్థను దాటి రక్త ప్రసరణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపగలవు. గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక సమస్యలతో వాయు కాలుష్యానికి సంబంధం ఉంది. వాహనాల పొగ, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, చెత్త దహనం, నిర్మాణ రంగం, వ్యవసాయ అవశేషాల దహనం వంటి అనేక కార్యకలాపాలు దీనికి కారణమవుతున్నాయి. అందువల్ల గాలి నాణ్యతను కాపాడటం వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదు; అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, పట్టణ ప్రణాళికకు సంబంధించిన అంశం. నీరు మనిషి జీవనానికి మరో ప్రాథమిక ఆధారం. ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికి సుమారు 73 శాతం జనాభాకు మాత్రమే సురక్షితంగా నిర్వహించబడిన తాగునీటి సేవలు అందుబాటులో ఉన్నాయి. అంటే సుమారు 27 శాతం మంది, దాదాపు 220 కోట్ల మంది, ఇంటి వద్ద అందుబాటులో ఉండే, అవసరమైనప్పుడు లభించే, కలుషణం లేని సురక్షిత తాగునీటి ప్రమాణాన్ని పొందలేకపోయారు.

నీటి సమస్యలో పరిమాణం కంటే నాణ్యత కూడా అత్యంత ముఖ్యమైనది. నీరు అందుబాటులో ఉన్నా అందులో సూక్ష్మజీవులు, రసాయన కాలుష్యాలు లేదా ఇతర హానికర పదార్థాలు ఉంటే అది ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుంది. తాగునీటి కాలుష్యం జీర్ణకోశ వ్యాధులు, అంటువ్యాధులు, పిల్లల్లో పోషకాహార సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. నీటి కొరత, భూగర్భజలాల అధిక వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ రసాయనాల ప్రవాహం, పట్టణ మురుగునీటి నిర్వహణలో లోపాలు భవిష్యత్తులో నీటి భద్రతను మరింత సవాలు చేస్తున్నాయి. ఆహారం విషయంలో ఆధునిక మానవ సమాజం ఒక విరుద్ధ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఆహార ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్, ఆన్‌లైన్ డెలివరీ వంటి సౌకర్యాలు విస్తరించాయి. మరోవైపు పోషక విలువలున్న సమతుల ఆహారం అందరికీ సమానంగా అందుబాటులో లేదు. ఐక్యరాజ్యసమితి సంస్థల 2024 నివేదిక ప్రకారం 2023లో సుమారు 233 కోట్ల మంది ప్రపంచవ్యాప్తంగా మితమైన లేదా తీవ్రమైన ఆహార భద్రతా సమస్యను ఎదుర్కొన్నారు. 2022లో 280 కోట్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. తక్కువ ఆదాయ దేశాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండి, అక్కడ సుమారు 71.5 శాతం జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోయింది. అధిక ఆదాయ దేశాల్లో ఈ శాతం 6.3గా ఉంది. ఇది ఆధునిక ఆహార వ్యవస్థలో ఉన్న ఆర్థిక అసమానతలను స్పష్టంగా చూపిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం అంటే కేవలం కడుపు నింపడం కాదు. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, గింజలు వంటి పోషక విలువలున్న ఆహారాలతో పాటు ఉప్పు, ఉచిత చక్కెరలు, అధిక సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ కొవ్వులను పరిమితం చేయడం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.

ఆధునిక జీవనశైలిలో మరో ముఖ్యమైన అంశం ఆహార నాణ్యత మాత్రమే కాకుండా ఆహారం తీసుకునే విధానం. వేగవంతమైన జీవనశైలి కారణంగా ఇంటి వంటకు బదులుగా అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం, ఫాస్ట్ ఫుడ్, అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన పదార్థాల వినియోగం పెరిగే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఇటువంటి ఆహారపు అలవాట్లు స్థూలకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అసంక్రమణ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి. ప్రపంచవ్యాప్తంగా పెద్దల స్థూలకాయం 2012లో 12.1 శాతం ఉండగా 2022లో 15.8 శాతానికి పెరిగినట్లు 2024 ఐక్యరాజ్యసమితి ఆహార భద్రతా నివేదికలో పేర్కొనబడింది. గాలి, నీరు, ఆహారం సమస్యలను విడివిడిగా చూడటం కూడా సరైనది కాదు. ఇవి పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఉదాహరణకు వాయు కాలుష్యం వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చు. వాతావరణ మార్పులు నీటి లభ్యతను మార్చవచ్చు. నీటి కొరత వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తే ఆహార ధరలు పెరగవచ్చు. ఆహార ధరలు పెరిగితే తక్కువ ఆదాయ కుటుంబాలు పోషక విలువలు ఎక్కువగా ఉన్న ఆహారం కంటే తక్కువ ధరలో లభించే ఆహారాన్ని ఎంచుకునే పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ విధంగా పర్యావరణం–ఆర్థిక వ్యవస్థ–ఆరోగ్యం మధ్య ఒక నిరంతర సంబంధం ఏర్పడుతుంది.

ఇక బయట నుంచి మనిషిపై పడుతున్న ఒత్తిడిని పరిశీలిస్తే సమస్య మరింత విస్తృతంగా కనిపిస్తుంది. పట్టణ జీవితం సమయాభావం, ఉద్యోగ పోటీ, రవాణా సమస్యలు, జీవన వ్యయం, కుటుంబ బాధ్యతలు, సామాజిక పోలికలు, డిజిటల్ పరికరాల అధిక వినియోగం వంటి అనేక ఒత్తిళ్లను కలిగిస్తోంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఈ పరిస్థితుల ప్రభావానికి లోనవుతోంది. పని–వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత లేకపోవడం నిద్ర, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సామాజిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆధునిక మానవ జీవితంలో 'సౌకర్యం' పెరిగినప్పటికీ 'సహజ జీవనం' తగ్గుతున్న విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. గతంలో శారీరక శ్రమ జీవనంలో సహజ భాగంగా ఉండేది. ప్రస్తుతం అనేక వృత్తుల్లో ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, వ్యక్తిగత రవాణాపై ఆధారపడటం, డిజిటల్ పరికరాల ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల శారీరక చలనం తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా ఆహారం, శారీరక చలనం, నిద్ర, ఒత్తిడి అన్నీ పరస్పర సంబంధం కలిగిన అంశాలుగా మారుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వం, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలి. గాలి నాణ్యత కోసం ప్రజా రవాణా, స్వచ్ఛమైన ఇంధనాలు, పరిశ్రమల ఉద్గార నియంత్రణ, చెత్త దహనం తగ్గింపు వంటి చర్యలు అవసరం. నీటి భద్రత కోసం నీటి వనరుల పరిరక్షణ, మురుగునీటి శుద్ధి, భూగర్భజలాల సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ అవసరం. ఆహార భద్రత కోసం రైతుకు స్థిరమైన ఆదాయం, వినియోగదారునికి అందుబాటులో ఉండే పోషకాహారం, ఆహార వ్యర్థాల తగ్గింపు, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రజల్లో అవగాహన అవసరం. ప్రపంచ జనాభాలో 99 శాతం మంది డబ్ల్యూహెచ్‌వో గాలి నాణ్యత మార్గదర్శకాలను చేరని ప్రాంతాల్లో నివసిస్తున్నారని, 27 శాతం మందికి సురక్షితంగా నిర్వహించబడిన తాగునీరు అందుబాటులో లేదని, 2022లో 280 కోట్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోయారని పరిశీలిస్తే ఆధునిక అభివృద్ధి అసలు లక్ష్యం ఏమిటనే ప్రశ్న ముందుకు వస్తుంది. అభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, వేగవంతమైన రవాణా, డిజిటల్ సౌకర్యాలు, అధిక ఉత్పత్తి మాత్రమే కాదు. స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం కూడా అభివృద్ధికి ప్రాథమిక ప్రమాణాలే.

ముగింపుగా చూస్తే ఆధునిక మానవ జీవితానికి ఎదురవుతున్న ప్రధాన సవాలు ప్రకృతిని జయించడం కాదు; ప్రకృతితో సమతుల్యంగా జీవించడం. మనిషి శరీరానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో సమాజానికి స్వచ్ఛమైన పర్యావరణం, సమాన అవకాశాలు, ఆర్థిక భద్రత, మానసిక ప్రశాంతత అంతే అవసరం. గాలి విషపూరితమైతే ఆరోగ్యం దెబ్బతింటుంది; నీరు కలుషితమైతే జీవన భద్రత దెబ్బతింటుంది; ఆహారం నాణ్యత కోల్పోతే శరీర పోషణ దెబ్బతింటుంది; నిరంతర బాహ్య ఒత్తిడి పెరిగితే జీవన నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి 21వ శతాబ్దపు నిజమైన అభివృద్ధి ప్రమాణం మనిషి ఎంత ఎక్కువ వినియోగిస్తున్నాడనే దానిలో కాకుండా, అతను ఎంత స్వచ్ఛమైన గాలిని పీలుస్తున్నాడు, ఎంత సురక్షితమైన నీటిని తాగుతున్నాడు, ఎంత పోషకమైన ఆహారం తీసుకుంటున్నాడు, ఎంత ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నాడు అనే అంశాల్లో ఉంది. ప్రకృతిని రక్షించడం అంటే కేవలం చెట్లను కాపాడటం కాదు; మనిషి భవిష్యత్తును కాపాడటం. గాలి–నీరు–ఆహారం అనే మూడు జీవనాధారాలను సంరక్షించడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన సమాజం, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, సమతుల్యమైన మానవ జీవితం నిర్మించగలుగుతాం. అందువల్ల ఆధునిక సమాజం ముందున్న అత్యవసర బాధ్యత 'అభివృద్ధి ఎంత?' అనే ప్రశ్న నుంచి 'అభివృద్ధి ఎంత ఆరోగ్యకరమైనది, ఎంత సుస్థిరమైనది?' అనే ప్రశ్న వైపు మారడం.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.